కథ

# అంతర్మథనం



ఆచంట హైమవతి

పదకొండేళ్ళ కమలకి ఎవరూ లేరు. కాని అందరూ ఉన్నట్లే ఉంటుంది. ఎందుకంటే కమల ఎవరేపని చెప్పినా చేస్తుంది. పని చేయించుకున్నవాళ్లు తృణమో.... పణమో ముట్ట చెప్తుంటారు.

నేను చెయ్యను - అని గాని, నాకు కుదరదు అనిగాని ఎప్పుడూ చెప్పదు కమల. అందుకనే ఆ చుట్టుపక్కలందరికీ కమలంటే చాలా ఇష్టం. కమల ఒక అవ్వ జతలో ఉంటోంది. కమలకి అవ్వ - అవ్వకి కమల ఒకరికొకరు తోడు. అంతే ! వాళ్ళు బంధువులు కాకపోయినా అందరి దృష్టిలో ఒకింటివాళ్ళే.

అవ్వకోసం కమల ఆత్రంగా ఇంటికి పరుగెడితే - కమల "ఇంకా ఇంటికి రాలేదు. ఇయ్యేల పని జాస్తి ఉందో ఏమో" అని అవ్వ కంగారు పడుతుంది.

ఆవేళ కమల వస్తూనే "నాకు శనట్టుకుంది. అందుకే ఏ పనీ దొరకటం లేదు" అంది దిగాలుగా.

"శనా....? ఎలాగుంటదే అది?" అడిగింది అవ్వ నవ్వుతూ.

"ఎలా గుంటవేంటి? దానికి రూపముంటదా?" విసుక్కుంది కమల.

"రూపం లేనిది నిన్నెలా పట్టుకుంటది?" అని ప్రశ్నించిన అవ్వకి జవాబు చెప్పలేకపోయింది కమల.

"ఎఱ్ఱిదానా... ! అదట్టుకుంది - ఇదట్టుకుంది అనుకునేకంటే మన పెయత్నమే తక్కువనుకుంటే మంచిది గదంటే....?" అంది అవ్వ.

"ఏమో..." అన్నట్లు పెదవి విరిచింది కమల.

"ఎవరినైనా పని చెప్పమని అడిగావా?" అడిగింది అవ్వ.

"లేదు. నన్ను పిలిచి వాళ్ళే పని చెప్పేవాళ్ళు గదా ! అప్పుడూ నేను పని అడగలేదు. ఇప్పుడూ అడగలేదు" తలొంచుకుని చెప్పింది కమల.

ఇదివరలో పనిచేసిన ఇళ్ళ చుట్టు పక్కల తిరిగి వస్తోంది కాని ఎవర్నీ పని అడగలేదు కమల. ఎవరూ పిలిచి పని చెప్పటం లేదు కమలకి.

కమలకి పని దొరక్క నాలుగు రోజులైంది. అవ్వతను తినేదాంట్లోంచే కమలకికూడా పెడుతోంది.

"తమలపాకులు, సున్నం సీసాలూ, ఒక్కపొడి పొట్లాలూ అమ్ముతుంది అవ్వ. పట్నంనుంచి ఒకడొచ్చి సరుకిచ్చి పోతుంటాడు అవ్వకి. అసలే కష్టంగా రోజులు గడుపుతున్న అవ్వ సంపాదన లేని తనక్కూడా తిండి పెట్టాల్సి రావటం నామర్ధాగా ఉంది కమలకి. ఆమె మొహమాటం చూసి అవ్వ ముసిముసిగా నవ్వుతూ – "నీ పెళ్ళయ్యాక నన్ను సాకుదువుగానిలే!" అంటుంది.

'నానేం పెళ్ళి చేసుకోను. నిన్నిడిసిఎల్లాల్నొత్తే. నాకిట్టం నేదు" అంటుంది సిగ్గుగా. కమల బుగ్గపిండి "సూద్దారి !" అంటుంది అవ్వ.

వారంరోజులైనా ఎవరూ ఏ పనికీ కమలని పిలవలేదు. అప్పుడింక కమల సంపాదన గురించి ఆలోచించక తప్పలేదు అవ్వకి. కమలతో కలిసి తిరిగే గౌరితో తెలివిగా కబుర్లుచెప్పి, నిగ్గతీసి, సంగతి బయటికి లాగింది. "ఈ సంగతి కమలకి తెలిసేనీకు ఏడుత్తది!" అని మాట తీసుకుంది గౌరి విషయం చెప్పేసి.

"బుద్ధిమంతురాలైన కమల ఇలా ఎందుకు తయారైంది?" అని బాధపడింది అవ్వ. కమలని బాధపెట్టకుండా ఎలా దారిలోకి తేవాలా? అనేదే ఆమె చింత.

రెండు రోజుల తర్వాత నమ్మకాల శాస్త్రిగారి దగ్గరకెళ్ళి జరిగిన సంగతి చెప్పి సలహా అడిగింది అవ్వ. ఆయన పరిస్థితిని అర్ధం చేసుకున్నారు. నమ్మకాల శాస్త్రిగారు తన దగ్గరకొచ్చిన వాళ్ళ స్థితిగతులను, మనస్తత్వాలను గ్రహించి, బాగా ఆలోచించి అందుకు తగ్గ సలహా ఇస్తారు. వారి సలహా పాటించిన వారందరూ బాగుపడ్డారే గాని ఎవరూ నష్టపోలేదు. అందుకే ఆ ఊరిలో ఆయనంటే అందరికీ గురి. సలహా పొంది తప్పక పాటిస్తారు,.

"నిజంగా జరిగిన కథ" అంటూ ఒక కథ చెప్పి బాగా నమ్మకం కలిగిస్తారు. వింటున్నవారు తప్పకుండా నమ్మేలాగ ఉంటుందా కథ. కలిగిన నమ్మకం, వారనుసరింపజేసే విధం కూడా గాఢం గానే ఉంటుంది.

✿ ✿ ✿

సన్నంగా పొడుగ్గా ఉన్న రాతిని ఎంచి, కమల చేత అవ్వ గుమ్మం పక్కన పాతేయించారు నమ్మకాలశాస్త్రిగారు. దానిమీద ఆంజనేయస్వామి బొమ్మ సింధూరం రంగుతో చిత్రించారు.

"రోజూ ఈ రాతిని కడిగి, కుంకుమబొట్టు పెట్టి, కొన్ని పువ్వులు స్వామిపై ఉంచి నమస్కరించు. ఈ సింధూర మారుతి దయతో నీకు పట్టిన కీడు పోతుంది. నువ్వు ఏ తప్పూ చెయ్యకూడదు. తప్పు చేశావా....? ఈ ఆంజనేయుడు నీ వెనుకనే ఉండి అన్నీ చూస్తుంటాడు. ఆయన ఇక్కడే ఉన్నా ఆయన శక్తి నిన్ను వెన్నంటుతూనే ఉంటుంది. నీ ప్రవర్తన మంచిగా లేకపోతే తన తోకతో నిన్ను బంధించి, గిరగిర తిప్పి దూరంగా విసిరేస్తాడు. అలా నిన్ను శిక్షిస్తాడు. నీకెవరైనా అన్యాయం తలపెట్టినా ఆయన వాళ్ళను కూడా శిక్షిస్తాడు." కమల శ్రద్ధగా వినటంతో మళ్ళీ "నువ్వు మంచిగానూ, భయభక్తులతోనూ నడుచుకుంటే నీకు సింధూర మారుతి మేలు చేస్తాడు" అని వివరంగా బోధించారు నమ్మకాల శాస్త్రిగారు.

ఆ 'రాతిమీద ఉన్న 'సింధూర మారుతి'ని శాస్త్రిగారు చెప్పినట్లు దీక్షగా పూజించసాగింది కమల. ఆమెకు 'సింధూర మారుతి'పై భక్తి కలగసాగింది.

కమలచేత తన ఇంట్లో పనులు చేయించ సాగారు శాస్త్రిగారు అది చూసి ఒక్కొక్కరే పిలిచి కమల చేత పని చేయించసాగారు. డబ్బులివ్వ సాగారు. కాని......? కమలని ఇంటి లోపలికి ఎవరూ చేర్చటం లేదు. ఇంకా అనుమానంగానే చూస్తున్నారు. పూర్వం ఇల్లంతా కమలకే అప్పగించే వారు. ఇప్పుడు ఎవరో ఒకరు కాపలా ఉంటున్నారు. ఆ సంగతిని స్పష్టంగా గమనించింది కమల. తన బుద్ధి అందరికీ తెలిసి, తనని దూరంగా ఉంచిన సంగతి అర్ధమై బాధ కలిగింది కమలకి. "నేను మళ్ళీ మంచిగా మారిపోతాను" అనుకుంది.

పని శుభ్రంగా చేసే అలవాటుండడం వల్ల కమలచేత పని చేయించుకోవటం అందరికీ ఇష్టమే! పూర్వం అలవాటైన ఇంట్లోనే పండుగకు ఇల్లు శుభ్రపరచాల్సిన పనికి పిలిచారు కమలని. పని చేస్తుండగా అలమర లోని వస్తువు ఆ పిల్లని ఆకర్షించింది.

అలవాటు ప్రకారం కాపలా ఉన్న అమ్మ గారు పక్కకి వెళితే దాన్ని సంగ్రహించాలని ఎదురు చూస్తోంది కమల. పదినిమిషాల ముందు తన చెడిన బుద్ధిని తిట్టుకున్న సంగతి తాత్కాలికంగా మరచి పోయింది.

లోపల్నుంచి అత్తగారి పిలుపందుకుని లోపలికెళ్ళింది కమలకి కాపలా ఉన్న చిన్న అమ్మ గారు. ఆ అదనుకోసమే చూస్తున్న కమల గబగబ అలమరు దగ్గరకెళ్ళింది. భరిణలో ఏముందోకాని భరిణమాత్రం చాలా ఆకర్షణీయంగా ఉంది. మెరుస్తున్న గాజు భరిణ మీద చెయ్యి వేసింది కమల. అంతే...! షాక్ కొట్టినట్లై చెయ్యి వెనక్కి తీసుకుంది. ఏదో విచిత్రమైన జలదరింపు కలిగిందామెకు. దానిక్కారణం "సింధూర మారుతి" గుర్తుకు రావటమే! ఆ స్వామి తోకతో తనను చుట్టి, గిరగిర తిప్పి విసిరేసినట్లు, తను చాలా దూరం ఎగిరి వెళ్ళి ముళ్ళతీగల్లో పడినట్లు అనిపించింది కమలకి. అసహాయంగా ఉన్నట్లుకూడా అన్పించి భయం వేసింది.

కంగారుగా వెనుతిరిగి చూసేసరికి ఆ ఇంటి యజమాని కొడుకు కమలని గమనిస్తూ నిలబడి ఉన్నాడు. ఉలికి పడిన కమల గబగబ చీపురుతో నీరు తుడవటం మొదలెట్టింది.

గుండె దడదడ లాడుతూ గాబరాగా అన్పించింది కమలకి. "నమ్మకాల శాస్త్రిగారు చెప్పినట్లు తన పాడు బుద్ధిని మార్చుకోవాలి. లేకపోతే జీవనం గడవటమే కష్టమైపోతుంది". అనుకొని "ఆ గాజు గిన్నెలో ఉన్నది ఏమిటో...? మనసు మళ్ళీ వెనక్కి లాగింది కమలకి. మరుక్షణమే "సింధూరమారుతి" గుర్తొచ్చి గుండె ఝల్లుమంది.

ఎందులో ఏముందో తనకనవసరం. తనకు చెప్పినపని తను చెయ్యటం తప్ప ఇంకేమీ ఆలోచించ కూడదు. తను చెడుగా ఉంటే తనని 'సింధూరమారుతి' దండిస్తాడని చెప్పారు. తను మంచిగా ఉంటే తనకి సాయం చేస్తాడని కూడా చెప్పారుగా ! అందుకే తను మంచిగా ఉండి "సింధూరమారుతి" చేసే మేలు పొందుతుంది. మళ్ళీ మళ్ళీ ఆ సంగతే మననం చేసుకుంటూ భయభక్తులతో ఆంజనేయనామం జపిస్తూ పని పూర్తి చేసింది కమల.

కమల మనస్సుని ఇంచుమించు గ్రహించాడు యజమాని కొడుకు కమలకి ఏదైనా ఉపకారం చెయ్యాలనే నిర్ణయానికి వచ్చాడు. ఆ పిల్ల చురుకుతనం వ్యర్ధం కాకూడదనీ, ఆ పిల్ల తెలివితేటలు అల్పబుద్ధికి లొంగిపోకూడదనీ పదేపదే అనుకున్నాడు.

ఆ ఊరిలో పదకొండు గంటల నుంచి నాలుగు గంటల వరకూ నడపబడుతున్న "కార్మిక బాలల పాఠశాల"లో కమలను చేర్పించాడు. చక్కగా చదువుకోవాలని చెప్తూ చదువు యొక్క ప్రాముఖ్యం వివరించి చెప్పాడతడు.

అందరూ ఆశ్చర్యపడేలాగ ఆరునెలల్లోనే రెండు తరగతుల పుస్తకాలు పూర్తి చేసేసింది కమల. మసి గిన్నెలమీద ఎక్కాలు వ్రాసేస్తోందిప్పుడు. ఎవరైనా చూసి హాస్యం చేస్తారని సిగ్గుతో తను వ్రాసినవి గబగబ కడిగి తోమేస్తూంటుంది.

కమల శని – ఆదివారాల శలవు రోజుల్లో కొవ్వొత్తుల కార్ఖానాలో పనిచేసి ఆ డబ్బుతో తనక్కావాలసినవి కొనుక్కుని తృప్తిపడుతోంది. కమలకిప్పుడు దొంగతనం చెయ్యాల్సిన అవసరం రావటం లేదు. అవకాశాలు వచ్చినా దొంగతనం పైకి దృష్టి పోవటమూ లేదు. నమ్మిన 'సింధూర మారుతి' చేసిన మేలది. ఇప్పుడు కమల పంకం వదలిన పద్మం.

మళ్ళీ అందరూ కమలకి ఆప్తులయ్యారు.

యజమాని కొడుకు నమ్మకాల శాస్త్రిగారి పథకం ప్రకారం మెరిసే గాజు భరిణలో కంకర్రాళ్ళు పెట్టారని కమలకి ఇప్పటికీ తెలీదు. ఆనాడామె ఆ భరిణ తెరిచి చూస్తే తన దుష్టబుద్ధి వల్ల అందులోని మణులు రాళ్ళైపోయాయని అలా 'సింధూరమారుతే' శపించి ఉంటాడని అనుకునేదేమో !